TGTEL/26/A4985

# ఆదాబ్ సైబరాబాద్

ADAAB CYBERABAD

www.adaabcyberabad.com
epaper.adaabcyberabad.com
adaabcyberabad@gmail.com

ఎడిటర్ : బిల్లాల్‌పూర్‌సారా శివ కుమార్ | సంపుటి : 1 | సంచిక : 29 | బుధవారం, 12 ఆగస్టు, 2026 | పేజీలు - 4 | వెల: 5/-

EDITOR : BILLALPURSARA SHIVA KUMAR | VOLUME : 1 | ISSUE: 29 | 12-08-2026 (WEDNESDAY) | PAGES: 4 | RS : 5/-

## మా డిమాండ్లలో
# ఎలాంటి మార్పు లేదు



న్యూ ఢిల్లీ :పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిష్టంభన కొనసాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. విపక్షాలు తమ డిమాండ్లను మార్చులేదని అన్నారు. విద్యార్థులపై పోలీసుల చర్య, రామ మందిర విరాళాల వ్యవహారం, ప్రభుత్వ క్షమాపణ వంటి మూడు అంశాలపై తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. ఈ అంశాలపై ప్రభుత్వం పార్లమెంట్?లో స్పష్టమైన ప్రకటన చేసే వరకు వాటిని లేవనెత్తుతామని తెలిపారు. పార్లమెంట్ ప్రాంగణంలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఖర్గే ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. "మేం మా లక్ష్యాన్ని మార్చుకోవడం లేదు. మొదటి నుంచే మా వైఖరి ఒకటే. మూడు నిర్దిష్ట అంశాలపై మేం సమాధానం కోరుతున్నాం. మొదటి అంశం విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జి, కాల్పులకు సంబంధించినది. ఈ ఆదేశాలు ఎవరు ఇచ్చారు అవి ఎలా తెలుసుకోవాలన కుంటున్నాం. దీనిపై సభలో సమాధానం కావాలి. లాఠీఛార్జి వల్ల పలువురు విద్యార్థులు అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో పాలయ్యారు. 100 మందికిపైగా స్వల్పంగా గాయపడ్డారు. మరికొందరికి పెల్లెట్ గన్? గాయాలయ్యాయి. ఈ విషయంపై ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరుతున్నాం. ఘటన జరిగి 18 రోజులు గడిచినా పూర్తి స్థాయి సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. వారు కేవలం ఓ చిన్న ప్రకటన చేసి అంశాన్ని ముగించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. విద్యార్థులపై పోలీసుల చర్యతో పాటు రెండోది రామ మందిర విరాళాల చోరీ. ఇక మూడోది, క్షమాపణలు చెప్పాలి. ఈ మూడు డిమాండ్లు మొదటి నుంచే ఉన్నాయి. ఇప్పటికి కొనసాగుతున్నాయి. పరిష్కారం లభించే వరకు వాటిని విపక్షాలు లేవనెత్తుతాయి"అంతకుముందు పార్లమెంట్ ప్రాంగణంలో ఝార్ఖండ్? విద్యార్థుల ఆందోళనపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ స్పందించారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఝార్ఖండ్‌లో నిరసన చేస్తున్న విద్యార్థులను కలిశారని తెలిపారు. అలాగే ఎన్‌డీఏ ఎంపీలు చేసిన నిరసనపై స్పందిస్తూ, పార్లమెంట్ ప్రాంగణంలో ఇలా చేయడం మొదటిసారి చూస్తున్నానని వ్యాఖ్యానించారు.

## పంజాబ్‌లో 'జాంబీ డ్రగ్' రాజకీయ
# దుమారం



పంజాబ్: బీజేపీ రాజ్యసభ ఎంపీ, మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ పంజాబ్‌లో డ్రగ్స్ సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ చేసిన పోస్టు పంజాబ్ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ప్రచారంలో ఉన్న వీడియో పంజాబ్‌కు చెందినది కాదంటూ హర్భజన్ సింగ్‌పై ఆప్ విరుచుకుపడుతోంది. ఈ దృశ్యాలు రాజస్థాన్‌కు చెందినవని పోలీసులు ఫ్యాక్ట్ చెక్ చేశారు. ఇదిలా ఉండగా, ఆ వీడియోలో ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై వింతగా, కదలిక లేకుండా నిలబడడంతో సోషల్ మీడియాలో ఇది వైరల్?గా మారింది. ఈ క్రమంలోనే స్పందించిన పలువురు నెటిజన్లు వీరిద్దరూ 'జాంబీ డ్రగ్' ప్రభవంతో ఉన్నారని వ్యాఖ్యానించారు. జాంబీ డ్రగ్ విస్తృత్రంగా ప్రచారం అవుతోంది.

## పత్తి కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే
# కఠిన చర్యలు



హైదరాబాద్, ఆగస్టు 11: పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఎంఎస్పీ కంటే తక్కువ ధరకు పత్తి అమ్మే పరిస్థితి రాకూడదని పేర్కొన్నారు. 2026-27 సీజన్‌లో 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నట్లు అంచనా వేశామని తెలిపారు. (మంగళవారం) సీసీఐ అధికారులతో పత్తి కొనుగోళ్లపై మంత్రి తుమ్మల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 25.85 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తిని అంచనా వేస్తున్నామని చెప్పారు. లాంగ్ స్టేపుల్ కాటన్‌కు రూ.8,667 ఎంఎస్పీ ధర ఉందని అన్నారు. గతేడాదితో పోలిస్తే రూ.557ల ఎంఎస్పీ ధర పెరిగిందని తెలిపారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు 122 నుంచి 131కు పెంచారని వెల్లడించారు. తెలంగాణలో 356 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. 15 నుంచి 30 రోజుల్లో అన్ని జిల్లాల్లో ఈ మిల్లులను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రైతుల ప్రతినిధులతో జిల్లా మానిటరింగ్ ఏర్పాటు చేయాలని మార్గనిర్దేశం చేశారు.

# హిమాచల్ ప్రదేశ్‌లో బీభత్సం
## భారీ వర్షాలకు 157 మంది మృతి



సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇప్పటివరకు 157 మంది మృతిచెందగా.. 257 మంది గల్లంతయ్యారు. జూన్ 30 నుంచి ఆగస్టు 9 మధ్య కాలంలో వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి కారణాలతో ఏకంగా 68 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 89 మంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాతపడ్డారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు దాదాపు 900 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు ధ్వంసమయ్యాయి. దీంతో సుమారు రూ.886 కోట్ల నష్టం వాటిల్లిందని రాష్ట్ర అత్యవసర కార్యకలాపాల కేంద్రం వెల్లడించింది.మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫ రాకు తీవ్ర అంతరాయం ఏర్పడి ంది. ముఖ్యంగా కుల్లు, మండి జిల్లాలు అత్యంత తీవ్రంగా ప్రభావితమయ్యాయి. సుమారు 161 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు) వారం రోజులుగా పని చేయడం లేదు. వీటిలో అత్యధికంగా మండిలో 77, సిమ్లాలో 43, కుల్లులో 40 డీటీఆర్‌లు పని చేయకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. హిమాచల్ ప్రదేశ్‌లో రుతుపవనాల కారణంగా ఏటా కురిసే భారీ వర్షాల మాదిరి గానే ఈ ఏడాదీ వానలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా కుల్లు అంతటా నదులు, వాగుల్లో నీటిమట్టాలు అకస్మాత్తుగా పెరిగాయి. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు ముంచెత్తడం వంటి భయంకరమైన దృశ్యాలు కనిపిస్తున్నాయి.

## రద్దీకి తగ్గట్లుగా కొత్త కోచ్‌ల కొనుగోలు,
# ఓల్డ్ సిటీ పనుల్లో వేగం

- మెట్రో రివ్యూలో రేవంత్ రెడ్డి ఆదేశం

మెట్రో రైలుపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

- మెట్రో రద్దీకి అనుగుణంగా కొత్త కోచ్‌లు కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశాలు
- డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ చర్చ



హైదరాబాద్: మెట్రోరైలు రెండో దశలో భాగంగా పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్‌పై ఉన్నతాధికారులతో రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. మెట్రో రైల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు.మెట్రో రైల్‌కు అదనపు బోగీలు : ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ఏడున్నర కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ కారిడార్?లో మెట్రో పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను మొదలు పెట్టాలని చెప్పారు. మెట్రో విస్తరణకు కోసం పెండింగ్?లో ఉన్న భూ సేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. రోజురోజుకు పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రయాణీకుల రద్దీకి తగినట్టుగా మెట్రో రైల్?కు అదనపు బోగీలను జత చేయాలని సూచించారు. మెట్రో రైల్ కోచ్‌లను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గ్లోబల్ సమ్మిట్?పై అధికారులతో చర్చ : మెట్రో రెండో ఫేజ్?లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణగుట్ట వరకు ఏడున్నర కిలోమీటర్ల కారిడార్ కోసం ప్రస్తుత టెక్నాలజీపై దిల్లీ మెట్రోను సంప్రదించి సలహాలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. డిసెంబర్?లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌పై కూడా అధికారులతో రేవంత్ రెడ్డి చర్చించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ వ్యాపార రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్?లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు.

## పేద పిల్లల కలలకు చిరునామాగా..
# యంగ్ ఇండియా స్కూల్స్




హైదరాబాద్, ఆగస్టు 11:

తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేట్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందిం చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతు న్నాయని సీఎం వెల్లడించారు.సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్.భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి. ఆ సంకల్పంతోనే తెలంగా ణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షి యల్ స్కూల్స్ వేగంగా రూపుది ద్దుకుంటు న్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ము గింపు పలుకుతూ.. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ.. ప్రతి చిన్నారికి ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవ భారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా... తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి' అంటూ ఎక్స్‌లో సీఎం

## రేవంత్‌రెడ్డి షెల్ కంపెనీల బాగోతాన్ని
# బయట పెడతాం



హైదరాబాద్, ఆగస్టు 11 : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు () సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ షెల్ కంపెనీల బాగోతాన్ని బయట పెడతామని హెచ్చరించారు. (మంగళవారం) తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. అనుముల కొండల్‌రెడ్డి టెస్రాక్ట్ (ఎవంతీఖవ్) సంస్థకు చైర్మన్‌గా ఉన్నానని ఆయనే చెప్పారని అన్నారు. రేవంత్ బ్రదర్స్ సూటు బూట్లతో కంపె నీలు ఎలా పెట్టారని ప్రశ్నించారు. టెస్రాక్ట్ కంపెనీలో ఒక్క ఎంప్లాయీ కూడా లేరని.. లక్ష రూపాయలతో ఆ కంపెనీ పెట్టడం ఎలా సాధ్యమని నిలదీశారు. ఆ కంపెనీకి వేల కోట్ల భూములు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. రూ.2వేల కోట్ల విలువ చేసే స్థలాన్ని రూ.7 వేల కోట్లకు కేటాయించారని ప్రస్తావించారు. ఆ కంపెనీకి కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు ఎలా చెబుతారని నిలదీశారు.

## సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదాలు
# 9 మంది మృతి

### ట్యాంకర్ ఢీకొని ఆటోలోని ఏడుగురు కూలీలు మృతి.. మరో ప్రమాదంలో ఇద్దరు మృతి



ఆదాబ్ సైబరాబాద్, సంగారెడ్డి: జిల్లాలో మంగళవారం వరుసగా చోటుచేసుకున్న రెండు ఘోర రోడ్డు ప్రమాదాల్లో మొత్తం తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామ శివారులో కూలీలతో వెళ్తున్న ఆటోను ఓ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు కూలీలు మృతి చెందారు. ప్రమాద సమయంలో ఆటోలో మొత్తం 14 మంది కూలీలు ఉన్నట్లు సమాచారం. మృతులు కర్ణాటకకు చెందినవారిగా పోలీసులు గుర్తించారు.ఇదే సమయంలో కోహిర్ మండలం కవేలి వద్ద మరో ఘోర ప్రమాదం జరిగింది. బీదర్ నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న వాహనాలపై ఓ కారు దూసుకెళ్లడంతో వరుసగా మూడు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వరుస ప్రమాదాలతో సంగారెడ్డి జిల్లా పరిధిలోని 65వ జాతీయ రహదారిపై విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదాలకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించాలి

- స్వాతంత్ర్య విలువలను కాపాడుతూ దేశాభివృద్ధిలో
- యువత భాగస్వాములు కావాలని
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత పిలుపు






**ఆదాబ్ సైబరాబాద్, హనుమకొండ :** రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవడంతో పాటు పౌరులుగా తమపై ఉన్న బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఉందని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలను పరిరక్షించడంలో యువత క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) వరంగల్ ఫీల్డ్ కార్యాలయం ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా'పై రెండు రోజుల ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ ఔట్రీచ్ ప్రోగ్రామ్ (ఐసీఓపీ), ఫొటో ఎగ్జిబిషన్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పోలీస్ కమిషనర్, కలెక్టర్ సందర్శించారు. జాతీయ పతాకం రూపుదిద్దుకున్న క్రమం, దాని ప్రస్థానం, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతిబింబించే చిత్రాలను వరంగల్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ తరుణ్ కుమార్ బోడా వివరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఎన్. శ్వేత మాట్లాడుతూ.. హక్కుల కోసం పోరాడటం మాత్రమే పౌర బాధ్యత కాదన్నారు. హక్కులు, బాధ్యతలు ఒకే నాణేనికి రెండు వైపుల వంటివని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను వినియోగించుకోవడంతో పాటు దేశం పట్ల తమ బాధ్యతలను నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగా లభించిన స్వేచ్ఛకు గౌరవం, విలువ ఇవ్వాలని సూచించారు. భవిష్యత్ తరాలకు ఎలాంటి సమాజాన్ని అందించాలన్నది ప్రస్తుత తరంపై ఆధారపడి ఉందన్నారు. దేశ అభివృద్ధి, భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని పేర్కొన్నారు. తమ జీవితాలను ఏ విధంగా మలుచుకోవాలన్నది యువత చేతుల్లోనే ఉందని, కష్ట పడి పనిచేస్తే జీవితాలను మరింత మెరుగుపరుచుకోవచ్చని సూచించారు.

### ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటం, స్వాతంత్ర్యం కోసం సమరయోధులు చేసిన త్యాగాలను ఎప్పటికీ మరచిపోకూడదన్నారు. స్వతంత్ర భారతదేశంలో జన్మించడం అదృష్టంగా భావించాలని, గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థను వారసత్వంగా పొందడం ప్రతి ఒక్కరికీ లభించిన విలువైన అవకాశమని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆగస్టు 15, జనవరి 26 వంటి జాతీయ పర్వదినాలను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వాతంత్ర్యం వెనుక ఉన్న కృషి, త్యాగం, పోరాటాలను భవిష్యత్ తరాలకు గుర్తుచేయాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నేటి జాతీయ పతాకం ఒక్కరోజులో రూపుదిద్దుకున్నది కాదని, దాని వెనుక ఎన్నో సంవత్సరాల పోరాటం, కృషి ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. దేశానికి లభించిన స్వేచ్ఛ, ప్రజాస్వామ్య వ్యవస్థను కృతజ్ఞతతో గుర్తుంచుకోవాలని, వాటిని పరిరక్షిస్తూ భవిష్యత్ తరాలకు మరింత బలమైన ప్రజాస్వామ్యాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించడమే లక్ష్యం

కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థుల్లో దేశం పట్ల బాధ్యత, దేశభక్తి భావనను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో కళాబృందాలు ప్రదర్శించిన 'హర్ ఘర్ తిరంగా' యక్షగానం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రజనీ లత, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి సమత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థిపై దాడిపై బాలల హక్కుల కమిషన్ సీరియస్

- శ్రీచైతన్య పాఠశాల భద్రతా లోపాలపై ఆరా



**ఆదాబ్ సైబరాబాద్, దమ్మాయిగూడ :** దమ్మాయిగూడలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థిపై తోటి విద్యార్థులు దాడి చేసిన ఘటనపై తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్‌గా స్పందించింది. కమిషన్ సభ్యురాలు గోగుల సరిత అధికారులతో మాట్లాడి ఘటన వివరాలను తెలుసుకున్నారు. జవహర్‌నగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సైదులుతో మాట్లాడి ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. సుమారు 600 మంది విద్యార్థులు చదువుతున్న పాఠశాలలో తగిన సీసీ కెమెరాలు లేకపోవడంపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. విద్యార్థుల భద్రతలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేసింది. పాఠశాలలో భద్రతా ప్రమాణాలు, సీసీ కెమెరాల ఏర్పాటు, యాజమాన్యం నిబంధనలపై జిల్లా డీఈవో సమగ్ర విచారణ చేపట్టాలని సూచించింది. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

# రైల్వే పనులు వేగవంతం చేయాలి



**ఆదాబ్ సైబరాబాద్, మల్కాజ్‌గిరి:** నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోరారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులతో సమావేశమై పనుల పురోగతిపై చర్చించారు. గౌతమ్‌నగర్ ఆర్‌యూబీ మంజూరుపై కృతజ్ఞతలు తెలిపారు. వాజ్‌పేయినగర్ రైల్వేగేట్ వద్ద ఆర్‌యూబీ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. లయోలా కాలేజ్--బీహెచ్‌ఈఎల్, భూదేవినగర్, బొల్లారం బజార్ ఆర్‌యూబీ పనులను త్వరితగతిన చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమన్నారు. సమావేశంలో హైదరాబాద్ డీఆర్‌ఎం సంతోష్‌వర్మ, ఏడీఆర్‌ఎం రామారావు, రైల్వే అధికారులు, ఇంజినీర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# మంజూరైన పనులు వెంటనే ప్రారంభించాలి

## జోనల్ కమిషనర్‌తో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఆదాబ్ సైబరాబాద్, రామంతాపూర్ :** రామంతాపూర్ డివిజన్‌లో మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తను కలిసి పెండింగ్ పనులపై చర్చించారు. నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మంజూరైన పనులను జాప్యం లేకుండా చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని కోరారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త పనులకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్

- రోడ్ల మరమ్మతులు, వాటర్ లాగింగ్ సమస్యల పరిష్కారం
- సిగ్నల్స్ పునరుద్ధరణపై సైబరాబాద్ పోలీసుల ప్రత్యేక దృష్టి





**ఆదాబ్ సైబరాబాద్, సైబరాబాద్ :** వర్షాకాలంలో వాహనదారులు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్, ఐపీఎస్ అధికారులను, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రోడ్ల అభివృద్ధి పనులు, ట్రాఫిక్ నిర్వహణ, వర్షపు నీటి నిల్వ సమస్యలు, మౌలిక వసతుల మెరుగుదలపై వివిధ శాఖల అధికారులతో సంయుక్తంగా సమీక్ష నిర్వహించారు. సైబరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమన్వయ సమావేశానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన, హెచ్ఎండబ్ల్యూఎస్అండ్ఎస్‌బీ ఎండీ అశోక్ రెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, టీజీఐఐసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కే. శశాంక, జాయింట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్ తదితరులు హాజరయ్యారు. ట్రాఫిక్-2 డీసీపీ, శాంతిభద్రతల విభాగానికి చెందిన శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ డీసీపీలు, ట్రాఫిక్-1, ట్రాఫిక్-2 ఏసీపీలు, సీడీసీ జోనల్ కమిషనర్లు, ఏఈ, ఏఈఈ స్థాయి అధికారులు, హైడ్రా సిబ్బంది, హెచ్‌జీసీఎల్, ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్‌ఏఐ, కేంద్ర రహదారులు, రవాణా శాఖ ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

### దెబ్బతిన్న రోడ్లకు తక్షణ మరమ్మతులు

సైబరాబాద్ పరిధిలో దెబ్బతిన్న రోడ్లు, గుంతలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా ఫ్రీ లెఫ్ట్‌ల అభివృద్ధి, మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

### వాటర్ లాగింగ్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

వర్షాకాలంలో తరచూ నీరు నిలిచే ప్రాంతాలను అన్ని జోన్లలో సంయుక్తంగా గుర్తించి, సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. వర్షపు నీటి కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.

### సిగ్నల్స్, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి

ట్రాఫిక్ నియంత్రణ కోసం అవసరమైన ప్రాంతాల్లో కొత్త ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడంతో పాటు పనిచేయని సిగ్నల్స్‌ను వెంటనే పునరుద్ధరించాలని నిర్ణయించారు. పాదచారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఫుట్‌పాత్‌ల నిర్మాణం, అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు.

### అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాల తరలింపు

ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ఇతర యుటిలిటీ మౌలిక వసతులను గుర్తించి వాటిని సకాలంలో తరలించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

### శాఖల మధ్య సమన్వయంతో సమస్యలకు పరిష్కారం

ట్రాఫిక్ సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిర్ణీత కాలపరిమితిలో సంయుక్త క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించి, అక్కడికక్కడే పరిష్కార మార్గాలను రూపొందించాలని సూచించారు.
ప్రజలకు అనుకూలమైన, వేగవంతమైన సేవలు అందించడంతో పాటు సైబరాబాద్ పరిధిలో వర్షాకాలంలోనూ వాహనాల రాకపోకలు సురక్షితంగా, సాఫీగా సాగేందుకు అన్ని భాగస్వామ్య శాఖలతో కలిసి పనిచేస్తామని సైబరాబాద్ పోలీసులు తెలిపారు.

# ఎస్సీ డ్రైవర్‌పై దాడి



**ఆదాబ్ సైబరాబాద్, మల్కాజిగిరి:** ఎస్సీ వర్గానికి చెందిన కార్ డ్రైవర్‌పై కులం పేరుతో దూషించి, చెప్పుతో కొట్టి దాడి చేసిన ఘటన మల్కాజిగిరిలో చోటుచేసుకుంది. ఈస్ట్ ఆనంద్‌బాగ్ తరుణ్ అవెన్యూలో సాయి కిరణ్ (36)పై గుడేపు సురేష్, సుజాత, తార దాడికి పాల్పడ్డారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. కులం పేరుతో దూషించడంతోపాటు తార చెప్పుతో కొట్టారని, సుజాత నెట్టివేశారని ఆరోపించారు. పోలీసులను ఆశ్రయిస్తే చంపేస్తామని బెదిరించినట్లు తెలిపారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**ఆదాబ్ సైబరాబాద్, జవహర్ నగర్ :** దమ్మాయిగూడలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, ఆయన భార్య తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాలాజీనగర్‌కు చెందిన షేక్ నాగూర్ షరీఫ్ (59), ఆయన భార్య కరీమున్నీసా (56) జూపిటర్ స్కూటీపై బాలాజీనగర్ నుంచి దమ్మాయిగూడ వైపు వెళ్తున్నారు. ఇన్‌స్టామార్ట్ సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన స్విఫ్ట్ కారు వేగంగా, నిర్లక్ష్యంగా వచ్చి వారి స్కూటీని ఢీకొట్టింది. ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని దమ్మాయిగూడ ఆదిత్య ఆసుపత్రికి తరలించగా.. నాగూర్ షరీఫ్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన కరీమున్నీసాను మెరుగైన చికిత్స కోసం ఈసీఐఎల్‌లోని జెనియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ టి.సందీప్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడు షేక్ ఉస్సేన్ ఫిర్యాదు మేరకు జవహర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీ చైతన్య విద్యా సంస్థల బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థుల తరలింపు


- యు.ఎస్.ఎఫ్.ఐ ఖమ్మం జిల్లా కమిటీ నిరసన స్పందించి బస్సును సీజ్ చేసిన ఆర్టీఓ అధికారులు.




**ఆదాబ్ హైదరాబాద్, ఖమ్మం :** ఖమ్మం నగరంలో శ్రీ చైతన్య విద్యా సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ఒకే బస్సులో 100 మందికి పైగా విద్యార్థులను ఎక్కించి వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని యుఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు సంఘం నాయకులు కలిసి బస్సును ఆపి విద్యా సంస్థ యాజమాన్యానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు.
ఈ సందర్భంగా యు.ఎస్.ఎఫ్.ఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి బొట్ల సాగర్ మాట్లాడుతూ, కార్పొరేట్ విద్యా సంస్థ అయిన శ్రీ చైతన్య, విద్యార్థుల నుండి వేల రూపాయలు బస్సు ఫీజుల రూపంలో వసూలు చేస్తూ, కనీస భద్రతా ప్రమాణాలు పాటించడం లేదు. సీటింగ్ సామర్థ్యం కంటే రెట్టింపు స్థాయిలో, సుమారు 100 మంది విద్యార్థులను ఒకే బస్సులో మేకల మందలా తరలిస్తున్నారు. అత్యవసర సమయంలో ప్రమాదం జరిగితే విద్యార్థుల ప్రాణాలకు ఎవరు బాధ్యత వహిస్తారు? అని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.
విద్యార్థుల భద్రతను గాలికి వదిలేసి, లాభాపేక్షే ధ్యేయంగా వ్యవహరిస్తున్న శ్రీ చైతన్య యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, జిల్లాలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల బస్సుల ఫిట్‌నెస్‌ను సమగ్రంగా తనిఖీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యు.ఎస్.ఎఫ్.ఐ నిరసన మరియు ఫిర్యాదుకు తక్షణమే స్పందించిన రవాణా శాఖ (ఆర్టీవో) అధికారులు, పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న శ్రీ చైతన్య విద్యా సంస్థకు చెందిన బస్సును అక్కడికక్కడే సీజ్ చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి విద్యా సంస్థపైనా అయినా చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో యు.ఎస్.ఎఫ్.ఐ నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 22-ఏ జాబితా నుంచి తొలగింపునకు చర్యలు

## మల్కాజ్‌గిరిలో 10 వేల మంది ఆస్తి యజమానులకు ఊరట



**ఆదాబ్ సైబరాబాద్, మల్కాజ్‌గిరి:** వక్ఫ్ భూముల రికార్డుల్లోని తప్పిదాలపై పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడింది. మల్లాపూర్‌కు చెందిన పలు సర్వే నంబర్లు మల్కాజ్‌గిరి గ్రామానికి చెందినవిగా నమోదు కావడంతో 22-ఏ నిషేధిత జాబితాలో చేరాయి. దీంతో ఏళ్లుగా ఆస్తి యజమానులు రిజిస్ట్రేషన్ల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అధికారులతో నిరంతరం ఫాలోఅప్ చేశారు. ప్రభావిత సర్వే నంబర్లను 22-ఏ జాబితా నుంచి తొలగించేందుకు వక్ఫ్ బోర్డు చర్యలు చేపట్టింది. పాత గెజిట్ నోటిఫికేషన్లలోని వ్యత్యాసాలను సరిచేసేందుకు నిర్ణయించింది. అవసరమైన సవరణలను అధికారిక గెజిట్‌లో ప్రచురించేందుకు ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో దాదాపు 10 వేల మంది ఆస్తి యజమానులకు ఊరట లభించే అవకాశం ఉంది.

TGTEL/26/A4985

ఆదాబ్ సైబరాబాద్

ADAAB CYBERABAD

బుధవారం, ఆగస్టు 12, 2026



# హత్య కేసు నిందితుడిపై పీడీ యాక్ట్

**- జూబ్లీహిల్స్‌లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసులో**

**- నేపాల్‌కు చెందిన సునీల్ బహదూర్ అరెస్టు**

ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన హత్య కేసులో నిందితుడిగా ఉన్న నేపాల్‌కు చెందిన సునీల్ బహదూర్ ఆవుజీ అలియాస్ సునీల్ పరియార్‌పై హైదరాబాద్ నగర పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగి ంచారు. హత్యతో పాటు దోపిడీకి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అతడిని మంగళవారం పీడీ యాక్ట్ కింద నిర్బం ధించి, నిబంధనల ప్రకారం జైలుకు తరలించారు.పోలీసుల వివరాల ప్రకారం.. సునీల్ బహదూర్ ఆవుజీ అలియాస్ సునీల్ పరియార్ (29) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మహారాష్ట్రలోని నవీ ముంబై పరిధిలో నివాసం ఉంటున్న అతడు నేపాల్‌లోని అచ్చం జిల్లా టిమిల్సైన్ గ్రామానికి చెందినవాడిగా పోలీసులు గుర్తించారు.జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రే వినయ్ రంజన్ భార్య తనుజా రంజన్ (62) హత్యకు గురైన ఘటనలో సునీల్ బహదూర్ ప్రధాన నిందితుల్లో ఒకరిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 103(1), 309(2), 317(3) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.హత్యకు ముందు కుట్ర.. ఇంట్లోకి చొరబడి హత్యపోలీసుల కథనం ప్రకారం.. సునీల్ బహదూర్ తన సహచరులతో కలిసి హత్యకు కుట్ర పన్నినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం తనుజా రంజన్ నివాసంలోకి అక్రమంగా ప్రవేశించి ఆమెను



నిర్బంధించి, ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు కేసు దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. అనంతరం ఇంట్లోని బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను తీసుకుని అక్కడి నుంచి పరారైనట్లు పేర్కొన్నారు.ఈ కేసులో సునీల్ బహదూర్‌ను మే 22, 2026న పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం న్యాయస్థానం ఆదేశాల మేరకు జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

■ **ఇతర కేసుల్లోనూ నిందితుడి ప్రమేయం**

సునీల్ బహదూర్‌పై ఇతర ప్రాంతాల్లోనూ కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. గుజరాత్‌లోని జామ్‌నగర్ జిల్లా ఏ డివిజన్ పోలీస్ స్టేషన్‌లో 2024లో నమోదైన కేసులో బీఎన్ఎస్ సెక్షన్లు 331(4), 305(ఏ), 54 కింద కేసు నమోదైందని తెలిపారు.అదేవిధంగా మహారాష్ట్రలోని నైగావ్ పోలీస్ స్టేషన్‌లో 2024లో నమోదైన మరో కేసులో బీఎన్ఎస్ సెక్షన్లు 331(3), 331(4), 3(5) కింద కేసు నమోదైనట్లు పోలీసులు పేర్కొన్నారు.

■ **ఆగస్టు 10న నిర్బంధ ఉత్తర్వులు**

నిందితుడి నేర చరిత్ర, జూబ్లీహిల్స్ హత్య కేసు తీవ్రత, ప్రజా శాంతి భద్రతలకు అతడి కార్యకలాపాల వల్ల ముప్పు ఏర్పడే అవకాశం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని పీడీ యాక్ట్ కింద చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.
హైదరాబాద్ పోలీస్ కమిషనర్ జారీ చేసిన డిటెన్షన్ ఆర్డర్ నంబర్ ఎస్బి(నెంబర్).688/సిఐయూ-1/పిడి/హెచ్వైడి/2026, తేదీ 10.08.2026 ఆధారంగా తెలంగాణ ప్రివెన్షన్ ఆఫ్ డేంజరస్ యాక్టివిటీస్ యాక్ట్, 1986లోని సెక్షన్ 3(2) కింద నిందితుడిని నిర్బంధించినట్లు వెల్లడించారు.దీనికి అనుగుణంగా సునీల్ బహదూర్ ఆవుజీ అలియాస్ సునీల్ పరియార్‌ను ఆగస్టు 11న పీడీ యాక్ట్ కింద నిర్బంధించి, నిబంధనల ప్రకారం జైలుకు తరలించినట్లు జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపారు.

■ **సంఘటిత నేరాలపై కఠిన చర్యలు**

అలవాటుగా, సంఘటితంగా నేరాలకు పాల్పడుతూ ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ నగర పోలీసులు స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు ముప్పుగా పరిణమించే నేర కార్యకలాపాలను అడ్డుకునేందుకు పీడీ యాక్ట్ వంటి చట్టపరమైన చర్యలను కొనసాగిస్తామని తెలిపారు.

# గుప్త నిధుల పేరుతో రూ.కోటి మోసం..! నలుగురు సభ్యుల ముఠా అరెస్ట్



ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : ఇళ్ల కింద గుప్త నిధులు ఉన్నాయని నమ్మించి అమాయకుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్న ముఠా గుట్టును శంషాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. రాజేంద్రనగర్ పోలీసుల సహకారంతో నిర్వహించిన ఆపరేషన్‌లో నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు కార్లు, ఒక ఆటోరిక్షా, రెండు మోటార్ సైకిళ్లు, నాలుగు సెల్‌ఫోన్లు, 25 నకిలీ బంగారు పూత నాణేలు, 6 కిలోల బొగ్గు, 4 కిలోల మట్టి, పూజా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.అరెస్టయిన నిందితు లను మహ్మద్ మునావర్ అలియాస్ మున్నా (36), సయ్యద్ అలీ అష్రఫ్ (40), మహ్మద్ హాజీ (25), మహ్మద్ సల్మాన్ (29)గా పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు మునావర్‌పై గతంలో బేగంబజార్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

■ **ప్రత్యేక విద్య ఉందంటూ నమ్మించి..**

పోలీసుల వివరాల ప్రకారం.. ప్రధాన నిందితుడు మునావర్ తనకు గుప్త నిధులను గుర్తించి వెలికితీసే ప్రత్యేక విద్య ఉందని చెప్పి అమాయకులను నమ్మించేవాడు. అనంతరం బాధితులను లక్ష్యంగా చేసుకుని వారి ఇళ్ల వద్ద గుప్త నిధులు ఉన్నాయని చెప్పేవారు.
ముందుగా బాధితులతో గుంత తీయించి, అందులో బొగ్గు, నకిలీ బంగారు నాణేలు ఉన్న సంచిని రహస్యంగా ఉంచేవారు. అనంతరం అక్కడ పూజలు నిర్వహించి, బొగ్గు బంగారంగా మారేందుకు కొంత సమయం పడుతుందని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయేవారు.
ఈ మోసపూరిత పద్ధతిలో సుమారు 11 మందిని మోసం చేసి రూ.1 కోటి వరకు వసూలు చేసినట్లు దర్యాప్తులో ఆధారాలు లభించినట్లు పోలీసులు వెల్లడించారు.

■ **కేసు నమోదు.. దర్యాప్తు కొనసాగింపు**

ఈ ఘటనపై రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 916/2026గా కేసు నమోదు చేశారు. బిఎన్ఎస్ సెక్షన్లు 318(4), 351(2), 61(2) ఆర్/డబ్ల్యూ 3(5) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

■ **ప్రజలకు పోలీసుల హెచ్చరిక**

గుప్త నిధులు వెలికితీస్తామని, తమకు ప్రత్యేక శక్తులు ఉన్నాయని చెప్పే వ్యక్తులను నమ్మి డబ్బులు చెల్లించవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. ఇలాంటి మోసపూరిత లేదా అక్రమ కార్యకలాపాల గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.ఈ కేసును శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె. రవి, ఎస్ఐలు కె. మన్సూర్ అలీ, నర్సింగరావు, ఎస్. శేషు మరియు సిబ్బంది, రాజేంద్రనగర్ పోలీసుల సమన్వయంతో ఛేదించారు.

# ఖమ్మం బైపాస్ రోడ్డులో న్యూ విజన్ జూనియర్ కాలేజీ వద్ద నిత్యం ట్రాఫిక్ అంతరాయం

**- పార్కింగ్ సౌకర్యం లేక**

**- రహదారిపైనే వాహనాలు.**

**- స్థానికులకు తీవ్ర ఇబ్బందులు**

**- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు.**

**- కాలేజీ యాజమాన్యం ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు.**

ఆదాబ్ సైబరాబాద్, ఖమ్మం :ఖమ్మం బైపాస్ రోడ్డులోని న్యూ విజన్ జూనియర్ కాలేజీ క్యాంపస్ వద్ద ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు విద్యార్థుల, తల్లిదండ్రులు వాహనాలతో బైపాస్ రోడ్డుపై రద్దీ ఏర్పడుతోందని స్థానికులు వాహనదారులు చెబుతున్నారు.పెద్ద సంఖ్యలో విద్యార్థులు చదువుతున్నప్పటికీ వాహనాలను నిలిపేందుకు తగిన పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు రహదారి పక్కనే కాకుండా కొన్నిసార్లు ప్రధాన రహదారిపైనే నిలిపివేస్తుండటంతో ట్రాఫిక్ రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని పేర్కొంటున్నారు.ఇప్పటికే రద్దీగా ఉండే ఖమ్మం బైపాస్ రోడ్డుపై వాహనాలను అడ్డదిడ్డంగా నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనకు దారితీయడమే కాకుండా, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు అంటున్నారు. రహదారిపై వాహనాల పార్కింగ్ కారణంగా అత్యవసర వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బంది కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



■ **నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు**

ప్రధాన రహదారిపై వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే పరిస్థితులపై ట్రాఫిక్ పోలీసులు, సంబంధిత అధికారులు తక్షణమే దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నిలిపినట్లయితే నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడంతో పాటు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.అదేవిధంగా కాలేజీ యాజమాన్యం విద్యార్థులు, తల్లిదండ్రుల వాహనాల కోసం సరైన పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, ప్రధాన రహదారిపై వాహనాలు నిలవకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

■ **ధనార్జనపైనే దృష్టి. మౌలిక సదుపాయాలు గాలికి?**

విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయడంపై చూపుతున్న శ్రద్ధను విద్యార్థుల భద్రత, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ వంటి మౌలిక సదుపాయాలపై కూడా చూపించాలని స్థానికులు సూచిస్తున్నారు. పార్కింగ్ సమస్యను పరిష్కరించకుండా కాలేజీ కార్యకలాపాలు కొనసాగించడం వల్ల ప్రతిరోజూ ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తున్నారు.
ఈ సమస్యపై స్థానికులు ప్రశ్నించినప్పుడు కాలేజీ యాజమాన్యం సరైన రీతిలో స్పందించకుండా కాలయాపన చేస్తోందని వారు అంటున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరింత తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

■ **డీ.ఈ.ఓ, ట్రాఫిక్ పోలీసులు తక్షణమే స్పందించాలి**

ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, సంబంధిత మున్సిపల్ అధికారులు సంయుక్తంగా
న్యూ విజన్ జూనియర్ కాలేజీ పరిసరాలను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. కాలేజీ వద్ద వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణ, విద్యార్థుల రాకపోకలపై ప్రత్యేకంగా పరిశీలన జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రధాన రహదారిపై వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నట్లు అధికారులు గుర్తిస్తే, ట్రాఫిక్ నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.పార్కింగ్‌కు అనువైన స్థలం లేకపోవడం వల్లే నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నట్లయితే, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయడం లేదా అవసరమైతే క్యాంపస్ నిర్వహణపై సంబంధిత అధికారులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు సర్వత్ర విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యాసంస్థ నిర్వహణతో పాటు విద్యార్థుల భద్రత, ప్రజల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కూడా ముఖ్యమే. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఖమ్మం బైపాస్ రోడ్డులో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి" అని స్థానికులు కోరుతున్నారు.

# తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు ,కార్యకర్తలకు నమస్కారం

**- రాష్ట్ర మంత్రీ వర్యులు సీతక్క ఆదేశాల మేరకు.**

**- ఆగస్టు 16 , ఆదివారం రోజున మేడారం విచ్చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి**

**- పర్యటనను విజయవంతం చేయాలి**

**తేదీ:12.08.2026 బుధవారం ఉదయం 10:00 గంటలకు**



ఆదాబ్ సైబరాబాద్,ములుగు:ములుగు జిల్లాలోని తాడ్వాయి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంకిడి నరసింహా స్వామి ఆద్వర్యంలో జరిగే అత్యవసర సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్న ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ మండల ఇంచార్జీ జగన్మోహన్ రెడ్డి కావున జిల్లా నాయకులు , సీనియర్ నాయకులు , మండల నాయకులు , సహకార సంఘం చైర్మన్, మాజీ చైర్మన్ లు , సింగిల్ విండో డైరెక్టర్ లు , సర్పంచులు , ఉపసర్పంచులు , మాజీ సర్పంచులు , మాజీ ఎంపీటీసీలు , అనుబంధ సంఘాల నాయకులు , గ్రామ కమిటీ అధ్యక్షులు , యూత్ కాంగ్రెస్ నాయకులు , మహిళా నాయకురాలు , ప్రతీ ఒక్కరూ అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరుతూన్నాను మంకిడి నరసింహా స్వామి తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు.

# ఫాలుదా బండ్లు.. కుల్ఫీ.. మిల్క్‌షేక్! పేర్లు మారుతున్నాయి

**- ఆహార భద్రతపై అనుమానాలు మాత్రం తొలగడం లేదు**

**- రోడ్ల పక్కనే విక్రయాలు. పరిశుభ్రత, నిల్వ, నీటి నాణ్యతపై ప్రశ్నలు**

**- ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నారా? లైసెన్సులు ఉన్నాయా?**

ఆదాబ్ సైబరాబాద్, ఖమ్మం :ఫాలుదా, కుల్ఫీ, మిల్క్‌షేక్, ఐస్‌క్రీమ్ పేర్లు ఆకర్షణీయంగా ఉండటంతో పాటు ధరలు అందు బాటులో ఉండడంతో చిన్నారులు, యువత, పెద్దలు వీటిని ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం, రాత్రి వేళల్లో ప్రధాన రహదారులు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఫాలుదా, కుల్ఫీ, మిల్క్‌షేక్ బండ్లు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. అయితే వీటి తయారీ, నిల్వ, విక్రయాల్లో ఆహార భద్రతా నిబంధనలు ఎంతవరకు అమలవుతున్నాయన్నదే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.రోడ్ల పక్కనే ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయిస్తున్న నేపథ్యంలో దుమ్ము, వాహనాల పొగ, చెత్త, మురుగు వంటి వాటి ప్రభావం ఆహార పదార్థాలపై పడే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినియోగిస్తున్న నీరు శుభ్రమైనదేనా? పాలు, క్రీమ్, ఐస్‌క్రీమ్, ఫ్రూట్స్, డ్రైఫ్రూట్స్ వంటి పదార్థాలను సరైన ఉష్ణోగ్రతల్లో నిల్వ చేస్తున్నారా? గడువు ముగిసిన పదార్థాలను ఉపయోగిస్తున్నారా? అనే అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

■ **రోడ్డుపైనే తయారీ, పరిశుభ్రతపై ప్రశ్నలు.**

కొన్ని ప్రాంతాల్లో ఫుడ్ బండ్లు రహదారుల పక్కనే ఏర్పాటు చేస్తుండటంతో పరిసరాల పరిశుభ్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు కప్పి ఉంచుతున్నారా? విక్రేతలు చేతుల పరిశుభ్రత, హెడ్‌క్యాప్, గ్లౌజులు వంటి అవసరమైన జాగ్రత్తలు పాటిస్తున్నారా? ఉపయోగించే గ్లాసులు, పాత్రలు, స్పూన్లు శుభ్రంగా ఉన్నాయా?




తాగునీరు, ఐస్ ఎక్కడి నుంచి తెస్తున్నారు? వంటి అంశాలను అధికారులు పరిశీలించాల్సి ఉంది.

**ఫుడ్ లైసెన్సులు ఉన్నాయా?**

ఆహార పదార్థాల విక్రయాలు నిర్వహించే వారికి వర్తించే ఫుడ్ సేఫ్టీ నిబంధనలు అమలవుతున్నాయా? అవసరమైన ఫుడ్ సేఫ్టీ రిజిస్ట్రేషన్ లేదా లైసెన్స్ పొందారా? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. చిన్న వ్యాపారాలైనా, పెద్ద హోటళ్లైనా ఆహార భద్రత విషయంలో నిబంధనలు పాటించాల్సిందేనని ప్రజలు పేర్కొం టున్నారు.ఖమ్మం నగరంతో పాటు జిల్లాలోని ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాలు, రహదారుల వెంట ఇటువంటి ఆహార బండ్లు పెరుగుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారా? అన్నది ప్రజల ప్రశ్నగా మారింది.

■ **చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం.**

ఫాలుదా, కుల్ఫీ, మిల్క్‌షేక్, ఐస్‌క్రీమ్ వంటి చల్లని పదార్థాలకు చిన్నారులు, యువత ఎక్కువగా ఆకర్షితులవుతుంటారు. వీటిలో ఉపయోగించే పాలు, క్రీమ్, ఐస్‌క్రీమ్, పండ్లు, డ్రైఫ్రూట్స్ వంటి పదార్థాలను సరైన పద్ధతిలో నిల్వ చేయకపోతే ఆహార భద్రతకు సంబంధించిన సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వేసవి, వేడి వాతావరణ పరిస్థితుల్లో శీతలీకరణ అవసరమైన పదార్థాలను నిర్దేశిత ఉష్ణోగ్రతల్లో నిల్వ చేస్తున్నారా? అనే అంశాన్ని అధికారులు ప్రత్యేకంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

■ **తనిఖీలు ఎన్ని జరిగాయి?**

ఖమ్మం నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రోడ్డు పక్కన ఆహార విక్రయాలు జరుగుతున్నప్పటికీ వాటిపై ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎంతమేరకు తనిఖీలు నిర్వహిస్తున్నారు? ఎన్ని నమూనాలు సేకరించారు? నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే వివరాలు ప్రజలకు తెలియాల్సి ఉంది.కేవలం పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లపైనే కాకుండా రోడ్ల పక్కన ప్రజలు నేరుగా కొనుగోలు చేసి తినే ఆహార పదార్థాలపైనా అధికారులు నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అంశాలు
ఫాలుదా, కుల్ఫీ, మిల్క్‌షేక్ బండ్లపై ఇప్పటివరకు ఎన్ని తనిఖీలు నిర్వహించారు?ఎన్ని ఆహార నమూనాలను సేకరించారు? ఎన్ని బండ్లకు ఫుడ్ సేఫ్టీ రిజిస్ట్రేషన్ లేదా లైసెన్సులు ఉన్నాయి?
నిబంధనలు పాటించని విక్రేతలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఆహార పదార్థాల తయారీలో ఉపయోగించే నీరు, ఐస్ నాణ్యతను పరీక్షిస్తున్నారా?పాలు, క్రీమ్, ఐస్‌క్రీమ్, ఫ్రూట్స్ తదితర పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్నారా? గడువు ముగిసిన పదార్థాల వినియోగంపై తనిఖీలు జరుగుతున్నాయా?రోడ్డు పక్కన ఆహార విక్రయాలపై నిరంతర నిఘా వ్యవస్థ ఉందా?
'ఫుడ్ సేఫ్టీ' కాగితాలకే పరిమితం కాకూడదు ప్రజలు తినే ఆహారం సురక్షితంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. ఫుడ్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ఎంత ముఖ్యమో, క్షేత్రస్థాయిలో నిబంధనలు అమలయ్యేలా చూడడం కూడా అంతే ముఖ్యమని ప్రజలు అంటున్నారు. రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఫాలుదా బండి అయినా, పెద్ద హోటల్ అయినా, ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో నిబంధనలు సమానంగా అమలయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. వ్యాపారాలపై చర్యలు తీసుకోవడం కంటే ముందుగా ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేలా తనిఖీలు, నమూనాల సేకరణ, అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు.
ఖమ్మం జిల్లాలో ఫుడ్ సేఫ్టీ వ్యవస్థ క్షేత్రస్థాయిలో ఎంత సమర్థంగా పనిచేస్తోంది? రోడ్డు పక్కన ఆహార విక్రయాలపై అధికారుల నిఘా ఎంతవరకు ఉంది? అన్న ప్రశ్నలకు

# ప్రజా సేవను జీవిత లక్ష్యంగా ఎంచుకున్న మన సీతక్క




**- సమ్మక్క తల్లి ఒడిలో సీతమ్మ తల్లి**

ఆదాబ్ సైబరాబాద్,ములుగు:ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క తల్లి స్ఫూర్తిని గుండెల్లో నింపుకుని, ప్రజల సంక్షేమమే పరమావధిగా నిరంతరం ప్రజల కోసం పోరాడే ప్రజా నాయకురాలు మన సీతక్క అమ్మతనంలోని ఆప్యాయత, ఆపదలో ఆత్మీయ అండగా నిలిచే దాతృత్వ హృదయం, ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న మానవతామూర్తి మన సీతక్క అన్యాయాన్ని ఎదిరించే అపారమైన తెగువలో సమ్మక్క తల్లి వారసత్వాన్ని, ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయడంలో సారలమ్మ తల్లి సేవా స్ఫూర్తిని పునికి పుచ్చుకున్న ధీశాలి మన సీతక్కప్రజల కన్నీటిని తన కన్నీటిగా భావించి, ప్రజల కష్టసుఖాల్లో వెన్నంటి నిలిచి, అణగారిన వర్గాల ఆశలకు అండగా, ఆపన్నుల జీవితాలకు వెలుగుగా నిలిచే నిండు పున్నమి మన సీతక్క సమ్మక్క, సారలమ్మ తల్లుల పోరాట స్ఫూర్తికి ప్రతిరూపంగా, ప్రజాసేవను జీవిత లక్ష్యంగా ఎంచుకున్న మన సీతక్క ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచే, ప్రజలు అనునిత్యం కొలిచే ఆత్మీయ నాయకురాలు
గొంది సరితకాంగ్రెస్ పార్టీ తాడ్వాయి మండల మహిళా అధ్యక్షురాలు

# జీడిమెట్ల బస్ డిపోలో విషాదం

**- ఆర్టీసీ మెకానిక్ మృతి**




**ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్ జోన్ :** జీడిమెట్ల ఆర్టీసీ బస్ డిపోలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్యారేజ్ పిట్‌లో విధులు నిర్వహిస్తున్న మెకానిక్‌ను బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దుండిగల్ మండలానికి చెందిన మదన సంతోష్ (40) జీడిమెట్ల బస్ డిపోలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. రోజువారీ విధుల్లో భాగంగా మంగళవారం ఉదయం ఫస్ట్ షిఫ్ట్‌కు డిపోకు వెళ్లాడు. ఉదయం సుమారు 6:30 గంటల సమయంలో టీఎస్ 09 జెడ్ 0129 నంబర్ గల బస్సు గ్యారేజ్ పిట్‌లో ఉండగా, సంతోష్ బస్సు కింద విధులు నిర్వహిస్తున్నాడు. అదే సమయంలో ఆ బస్సు డ్రైవర్ కృష్ణారావు (స్టాఫ్ నంబర్ 215563) ఎలాంటి సంకేతాలు ఇవ్వకుండా, భద్రతా నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా బస్సును ముందుకు నడిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో బస్సు బంపర్ సంతోష్ తల వెనుక భాగం, ఛాతీకి బలంగా తగిలింది. తీవ్ర గాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సహోద్యోగి ద్వారా సమాచారంసంతోష్‌తో కలిసి పనిచేస్తున్న మెకానిక్ గోపాల్ (స్టాఫ్ నంబర్ 217681) ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు ప్రమాదం గురించి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న వెంటనే సంతోష్ భార్య ధనశ్రీ జీడిమెట్ల బస్ డిపోకు చేరుకున్నారు. అక్కడ భర్త తీవ్ర గాయాలతో మృతిచెంది ఉండటాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యం, భద్రతా నిబంధనలు పాటించకపోవడమే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా వెండి పట్టివేత




**హైదరాబాద్:** శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా వెండి నాణేలు పట్టుబడటం తీవ్ర కలకలం రేపుతోంది. ఢిల్లీ వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడి లగేజీలో సుమారు 7 కిలోల వెండి నాణేలను సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీ సిబ్బంది గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ వెండి నాణేలకు సంబంధించిన బిల్లులు, రసీదులు లేకపోవడంతో ఆ ప్రయాణికుడిని తమ అదుపులోకి తీసుకున్న అధికారులు.. వాటి గురించి విచారణ చేస్తున్నారుఎయిర్‌పోర్ట్ చెకింగ్ పాయింట్ వద్ద ప్రయాణికులు, వారి లగేజీని సీఐఎస్ఎఫ్ సిబ్బంది తనిఖీ చేస్తుండగా భారీగా ఈ వెండి నాణేలు బయటపడ్డాయి. వాటిపై అనుమానం రావడంతో సిబ్బంది ప్రయాణికుడి బ్యాగ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయగా అందులో భారీ మొత్తంలో వెండి నాణేలు ఉన్నట్లు గుర్తించారు. వాటి బరువు సుమారు 7 కిలోలుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ వెండి నాణేలు కొనుగోలు చేసినట్లు బిల్లులు గానీ, రసీదులు గానీ లేదా ఇతర ఆధారాలను ఆ ప్రయాణికుడు అధికారులకు చూపించలేకపోయినట్లు తెలుస్తోంది. దీంతో సీఐఎస్ఎఫ్ అధికారులు ఆ నాణేలు ఎక్కడి నుంచి వచ్చాయి. వాటిని ఢిల్లీకి ఎందుకు తరలిస్తున్నారు.. వాటి కొనుగోలుకు సంబంధించిన పత్రాలు ఎలేవు అనే అంశాలపై ఆరా తీస్తున్నారు.

# పింగళి వెంకయ్యకు భారతరత్న పురస్కారాన్ని ఇవ్వాలి.



**హైదరాబాద్ :** జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యకు భారతరత్న పురస్కారాన్ని ఇవ్వాలని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు హనుమంతరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. స్వాతంత్ర్య సమరయోధుడికి, భారత జాతీయ పతాక రూపకర్తకు దేశం అందించగల ఏకైక సముచితమైన నివాళి ఇదే అని చెప్పుకొచ్చారు. భారత జాతీయ పతాకం(త్రివర్ణ పతాకం) ప్రాథమిక రూపాన్ని రూపొందించిన ఘనత పింగళి వెంకయ్యకే దక్కుతుందన్నారు. హైదరాబాద్‌లో పింగళి వెంకయ్య విగ్రహాన్ని తాను ఏర్పాటు చేసినట్లు లేఖలో తెలిపారు. ఇప్పుడు భారత జాతీయ పతాకం ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యాన్ని, విస్తృత గుర్తింపును సాధించిందని వీహెచ్ అన్నారు. దివంగత పింగళి వెంకయ్య సేవలను తక్కువ చేసి చూడటం. భారత పతాక రూపకర్తకు జరిగిన అవమానమన్నారు. తెలుగు రాష్ట్రానికి పింగళి వెంకయ్య సేవలను మోదీ ఎందుకు మరచిపోయారో అర్థం కావడం లేదని తెలిపారు. జాతీయ పతాక రూపకర్తకు భారతరత్న ఇవ్వాలని.. దేశ ప్రజలు ఇదే అభిప్రాయాన్ని కలిగి ఉన్నారని వెల్లడించారు. 'ప్రధాని మోదీ 'హర్ ఘర్ తిరంగా' అంటున్నారు.. మంచిదే. జాతీయ జెండా రూపకల్పన చేసిన పింగళి వెంకయ్యకు సరైన న్యాయం జరగాలంటే భారతరత్న ఇవ్వాల్సిందే. పింగళి వెంకయ్యకు న్యాయం జరగడం వల్ల ప్రజల్లోకి ఒక మంచి సందేశం వెళ్తుంది. స్వాతంత్రం వచ్చిన 25 ఏళ్ల తర్వాత ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై జాతీయ జెండా ఎగరవేశారు' అని ప్రధానికి వీహెచ్ లేఖ రాశారు.

# జలాశయాలకు తగ్గిన వరద ప్రవాహాలు
# ఇక ఎగువ రాష్ట్రాల్లో కురిసే వానలపైనే ఆశలు

**హైదరాబాద్ :** ఎగువన ఉన్న ఆలమట్టి, నారాయణపుర్ రిజర్వాయర్లు పూర్తి స్థాయి నీటి నిల్వలతో కళకళలాడుతున్నా, వచ్చే నీటిలో సగం కూడా దిగువకు వదలట్లేదు. ఈ నెలలో ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకలలో కురిసే వర్షాలపైనే తెలంగాణలోని ఆయకట్టు భవిష్యత్తు ఆధారపడి ఉంది. ఆలమట్టిలోకి సోమవారం మధ్యాహ్నం 90 వేల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా, ఇందులో సగం కూడా నారాయణ పూర్ ప్రాజెక్టుకు వదలలేదు. 35 వేల క్యూసెక్కులతో జల విద్యుదుత్పత్తి : నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి 35 వేల క్యూసెక్కులు మాత్రమే దిగువకు వదులుతున్నా రు. ఆలమట్టిలో 129.72 టీఎంసీలకు గానూ 124.9, నారాయణపూర్‌లో 37.64 టీఎంసీలకు గానూ 37.57 టీఎంసీల నీరు ఉంది. ఈ రెండింటిలో కలిపి ప్రస్తుతం కేవలం ఐదు టీఎంసీలకు లోపే ఖాళీ ఉంది. అయినా 90 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తే 35 వేల క్యూసెక్కులను మాత్రమే బయటకు వదిలారు. ప్రియదర్శిని జూరాలకు 35 వేల క్యూసెక్కులు వస్తే, దిగువకు జల విద్యుదుత్పత్తి ద్వారా 23 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మరో 5 వేల క్యూసెక్కుల నీటిని ఎత్తిపోతల పథకాలు, జూరాల కుడి, ఎడమ కాల్వల నుంచి మళ్లిస్తున్నారు. ప్రవాహం పెరిగితేనే పాజెక్టుల్లో కళ : శ్రీశైలం ప్రాజెక్టులో 215.8 టీఎంసీలకు గానూ 182.6 టీఎంసీల నిల్వ ఉంది. 23,445 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండగా, ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్తు కేంద్రం ద్వారా విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు కిందికి విడుదల చేస్తున్నారు. తుంగభద్రలో 105 టీఎంసీలకు గానూ 80 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 42,450 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ఈ సమయంలో అటు ఆలమట్టి, ఇటు తుంగభద్రలోకి ప్రవాహం పెరిగితేనే శ్రీశైలం నిండటంతో పాటు నాగార్జునసాగర్‌లో కూడా నీటి నిల్వలు పెరుగుతాయి. శ్రీరాసాగర్‌లోకి 16 వేల క్యూసెక్కులే : గోదావరిలో కూడా అన్ని రిజర్వాయర్లలోకి ప్రవాహాలు చాలా మేరకు తగ్గాయి. శ్రీరామసాగర్‌లోకి ప్రస్తుతం 16,417 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ప్రస్తుతం 42 టీఎంసీలు ఉండగా, మరో 38.5 టీఎంసీలు వస్తే గానీ ఈ ఎస్సారెస్పీ నిండే అవకాసం లేదు. రిజర్వాయర్ నిండితేనే ఆయకట్టుకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. పూడిక కారణంగా ఎస్సారెస్పీ రిజర్వాయర్ సామర్థ్యం 80.5 టీఎంసీలకు పడిపోయింది. ఎగువన మహారాష్ట్రలోని జలవిద్యుత్తు కేంద్రం ద్వారా విద్యుదుత్పత్తి చేస్తూ జైక్వాడిలో నీటి నిల్వ పూర్తిస్థాయిలో ఉండటంతో వచ్చే 10 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే దిగువన ఉన్న శ్రీరామసాగర్? ప్రాజెక్టుకు వదులుతున్నారు. నిజాంసాగర్‌లోకి 4 వేలు, ఎల్లంపల్లిలోకి 5,800 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది.



# రిటైర్డ్ ఆర్మీ జవాన్ మృతి కేసులో నలుగురి అరెస్ట్




**హైదరాబాద్, ఆగస్టు11:** హైదర్ షాకోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ మృతి కేసులో నలుగురిని అరెస్ట్ చేశామని నార్సింగి ఇన్‌స్పెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రమాదానికి కారణమైన కారు ఓనర్ శంషాబాద్‌కు చెందిన క్రాంతి గౌడ్‌గా గుర్తించినట్లు తెలిపారు. మంగళవారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ.. హైదర్ షా కోటలోని తన అత్తగారింటికి బోనాల పండుగ సందర్భంగా అతడు వచ్చారని చెప్పారు. తన బావమరిది వికాస్ గౌడ్‌తో కలిసి పార్టీ చేసుకున్నారని అన్నారు. అనంతరం తెల్లవారుజామున టిఫిన్ చేద్దామని లంగర్ హౌస్ వైపు వారంతా కారులో అతి వేగంగా బయలుదేరారని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే రిటైర్డ్ ఆర్మీ జవాన్ రవీందర్‌తోపాటు బైక్‌ను కారుతో ఢీకొట్టారని తెలిపారు. అయితే రవీందర్ అక్కడికక్కడే మరణించగా.. బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారని చెప్పారు. ఈ కేసులో పట్టుబడిన నలుగురికి బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేశామన్నారు. వీరంతా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయిందన్నారు. అలాగే వీరికి డ్రగ్స్ పరీక్షలు కూడా నిర్వహించగా.. నెగిటివ్ వచ్చిందని పేర్కొన్నారు. ఈ ప్రమాదానికి కారణమైన వీరిపై 204 పార్ట్ 4 ఐపీసీతోపాటు మోటార్ వెహికల్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి అమాయకుల ప్రాణాలు తీయొద్దని ప్రజలకు నార్సింగ్ ఇన్‌స్పెక్టర్ విజ్ఞప్తి చేశారు. సోమవారంతెల్లవారు జామున హైదర్ షాకోట్ ఎస్ఎంపీ స్కూల్ సమీపంలో మహేంద్ర ఎస్‌యూవీ 350 కారు బీభత్సం సృష్టించింది. రోడ్డు పక్కన వెళ్తున్న పాదచారులపైకి కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి రవీందర్ గాలిలోకి ఎగిరిపడి అక్కడికక్కడే మరణించారు. అనంతరం బైక్ మీదకు కారు వెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ తర్వాత కారులో వారంతా పరారీ అవుదామనుకున్నారు. కానీ కారు ముందుకు కదల్లేదు. దీంతో కారు వదిలి వారంతా అక్కడి నుంచి పరారైయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరున్నారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. రవీంద్ర మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలోని సీసీ టీవీ కెమెరాలను జల్లెడ పట్టిన పోలీసులు.. నిందితులను అరెస్ట్ చేశారు. కారు రాంగ్ రూట్‌లో రావడంతోపాటు వారంతా మద్యం తాగి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.


# ఆగస్టు18 నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే




**హైదరాబాద్, ఆగస్టు 11:** నగరంలోని కేబీఆర్ పార్క్ సమీపంలో అండర్ పాస్‌లు, ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో పార్క్ చుట్టూ వన్ వే ఏర్పాటు చేస్తున్నట్లు నగర ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు మంగళవారం ప్రకటించారు. ఆగస్టు 18 నుంచి ఈ వన్ వే అమలు చేస్తామని స్పష్టం చేశారు. అందుకోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి పంజాగుట్ట వైపు వెళ్లే రోడ్డుకు వన్ వే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు వన్ వే అమలులో ఉంటుందని ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారి స్పష్టం చేశారు. మరోవైపు.. ఇటీవల ఒకటి, రెండు ఆదివారాలు కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లోని కూడళ్లలో సమస్యలను పరిష్కరించారు. అనంతరం అండర్ పాస్‌లు, ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తయ్యే వరకు ఈ వన్ వేను అమలు చేయాలని ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయించారు.

# ఖమ్మం రూరల్ ఓటర్లు 84,855

**-- సర్ తో 9,963 ఓట్లు గల్లంతు**




**ఖమ్మం రూరల్, ఆగస్టు 11 :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ అనంతరం ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీతో కలిపి మొత్తం 84,855 మంది ఓటర్లు ఉన్నట్లుగా తేలింది. మంగళవారం ఉదయం 10 గంటల వరకు సంబంధిత ఎన్నికల అధికారుల గణాంకాల ప్రకారం ఈ వివరాలు తెలిసింది. పాలేరు నియోజక వర్గంలో సర్ ప్రక్రియకు సంబంధించి జిల్లాలోనే అగ్రస్థానంలో ఉంది. మొత్తం ఓటర్లలో 92.19 % ఓట్ల నమోదు పూర్తి అయింది. గతంలో ఉన్న ఖమ్మం రూరల్ మండల పరిధిలో మొత్తం ఓటర్లు 94,818 మంది ఓటర్లు ఉండగా ఓటర్ జాబితా సవరణ సర్ ప్రక్రియ అనంతరం 84,855 మంది ఓటర్లుగా నిర్ధారణ అయింది. ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలంతో కలిపి మొత్తం పోలింగ్ స్టేషన్‌లో 101 గా ఉన్నాయి. సర్ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. తాజా గణాంకాల ప్రకారం 9,963 ఓట్లు గల్లంతు అయ్యాయి. వీటిలో 2,057 మంది ఓటర్లు చనిపోయినట్లుగా నిర్ధారణ కాగా మరో 7,203 ఓట్లు తమ సొంత ప్రాంతాలకు పర్మినెంట్ షిఫ్ట్‌గా నమోదైనట్లు తెలుస్తుంది. మరికొందరు ఎనిమిరేషన్ ఫారాలను అధికారులకు ఇవ్వకపోవడంతో మొత్తంగా సుమారు 10 వేల ఓట్లు తొలగించబడ్డట్టు తెలుస్తుంది. పూర్తి ప్రక్రియ అనంతరం ఈ గణాంకాలలో స్వల్ప మార్పులు చోటుచేసుకునే అవకాశం కనబడుతుంది.

# పచ్చని అడవుల్లో సరికొత్త అధ్యాయం..
# 50ఏళ్లలో తొలిసారి అక్కడ రెపరెపలాడిన త్రివర్ణం!



**ములుగు జిల్లా :** కర్రెగుట్టల్లో చరిత్రాత్మక అడుగు పడింది. ప్రకృతి అందాలకు ఆలవాలం.. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ఎత్తైన కొండలు కలిగి న కర్రెగుట్టలపైకి చేరుకున్న రాష్ట్ర డీజీపీ జఎ ఆనంద్ ఈ గుట్టలకు ప్రశాంతత లభించిందని పరవశించి పోయారు. నిత్యం రక్తం పారిన చోట.. తుపాకులు గర్జించిన బాటలో శాంతి కపోతాలను గాలిలోకి ఎగురవేసి ఇది చరిత్రలో నిలిచిపోయే రోజని ప్రకటించారు తెలంగాణ చత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లో మావోయిస్టు కార్యకలాపాలకు ఒకప్పుడు కీలక స్థావరంగా, అత్యంత సున్నితమైన ప్రాంతంగా పేరొందిన ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని కర్రెగుట్టల్లో తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ పర్యటించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొట్ట మొదటిసారి ప్రభుత్వ అధికారుల బృందం అధికారికంగా కర్రెగుట్టలపైకి రావడం ఇదే తొలిసారి అని డీజీపీ పేర్కొన్నారు. కర్రెగుట్టల్లో డీజీపీ పర్యటన సాహస యాత్రల సాగింది. పర్వతారోహణంలో తెలంగాణలో ఎత్తైన కొండ డోలిగుట్ట.. 964 మీటర్ల ఎత్తులో ఉన్న డోలిగుట్ట కర్రెగుట్టలో ఒక భాగం. ఎత్తైన కొండలు.. మారుమూల ప్రాంతం కావడంతో గతంలో కర్రెగుట్టలు మావోయిస్టులకు సురక్షిత ప్రాంతంగా ఉండేవి. మావోయిస్టులు ఈ ప్రాంతాన్ని షెల్టర్ జోన్‌గా ఉపయోగించు కోవడంతో పాటు డెన్‌లను ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు సాగించే వారుగతంలో గ్రేహౌండ్స్, కోబ్రా, దళాలు కర్రెగుట్టల్లో కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహించి తిరిగి వెళ్లేవి తప్ప ప్రభుత్వ అధికారుల బృందం గుట్టల పైకి రావడం ఇదే ప్రథమం అని డీజీపీ సీవీ ఆనంద్ గుర్తుచేశారు. అయితే గత రెండేళ్లలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర బలగాలు, కేంద్ర భద్రతా బలగాల సమన్వయంతో నిర్వహించిన ఖగార్ ఆపరేషన్లతో కర్రెగుట్టల్లో మావోయిస్టుల ప్రభావం పూర్తిగా తగ్గిందని ఆయన తెలిపారు. మావోయిస్టు నాయకత్వంలోని కీలక నేతలు, దళ సభ్యులు లొంగిపోవడం, కొందరు ఆపరేషన్లలో మృతి చెందడం, మరికొందరు ఆయుధాలు వదిలి ప్రభుత్వానికి లొంగిపోవ డంతో ఈ ప్రాంతంలో ప్రశాంత వాతావరణం ఏర్పడిందని డీజీపీ అన్నారు. కర్రెగుట్టల్లో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొంది.. ఇంతకాలం భద్రతా కారణాలతో దూరంగా ఉన్న ప్రాంతంలో ఇప్పుడు అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి.. "కర్రెగుట్టలపైకి ములుగు జిల్లా కలెక్టర్ ఇతర అధికార బృందంతో కలిసి చేరుకున్న డిజిపి శాంతి కపోతాలు పావురాలను ఎగురవేశారు.. జాతీయ జెండాను ఆవిష్కరించి ఆనందంతో మురిసిపోయారు. అధికారులతో కలిసి జాతీయ జెండా ఎగురవేయడం ఎంతో గర్వంగా ఉందని. ఇది చరిత్రలో నిలిచిపోయే రోజని డీజీపీ తెలిపారు. కర్రెగుట్టల ప్రాంతానికి రాకపోకలు సులభతరం చేసేందుకు గత ఆరు నెలలుగా అధికారులు తీవ్రంగా శ్రమించారు. వెంకటాపురం మండలంలోని పామునూరు, మురుమూరు, జల్లా, డోలి, తడపాల వరకు సుమారు 33 కిలోమీటర్ల తెలంగాణ సరిహద్దులో వబీటీ రోడ్డు నిర్మించే దిశగా చర్యలు తీసుకుంటామని డీజీపీ వెల్లడించారు. రహదారి సౌకర్యం అందుబాటులోకి వస్తే రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ సేవలు కూడా సులభంగా చేరే అవకాశం ఉందన్నారు.


EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com

# విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడింది?



**విశాఖపట్నం, ఆగస్టు 11:** జార్ఖండ్‌లో గ్రూప్ పరీక్షలో అవకతవకలు జరిగినట్లు తేలిందని.. ఈ క్రమంలోనే విద్యార్థులు ఆందోళన చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తెలిపారు. వారిపైనా రబ్బర్ బుల్లెట్స్, లాఠీఛార్జి చేశారన్నారు. జీజీవీ, కాంగ్రెస్ ప్రభుత్వమే అక్కడ నడుస్తోందని చెప్పారు. నీట్ పరీక్షలో లీక్ తెలిసిన వెంటనే పరీక్ష రద్దు చేశామని, పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేశారని వెల్లడించారు. బీజేపీ ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న తేడా ఇదే అన్నారు.జార్ఖండ్‌లో ఈ పేపర్ లీక్ వల్ల ఎంతో మంది యువత జీవితం రోడ్డుపాలవుతోందని మాధవ తెలిపారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందన్నారు. కేంద్రంలో తప్పు జరిగిందని.. వెంటనే దాన్ని కరెక్ట్ చేశామని అన్నారు. రాహుల్ గాంధీ పిరికివారని.. అందుకే పార్లమెంట్‌ రాకుండా పారిపోతున్నారని విమర్శించారు. పేపర్ లీక్‌పై చర్చించడానికి సిద్ధం ఉన్నట్లు స్పష్టం చేశారు. వైఎస్సార్ హయాంలో జరిగిన పేపర్ లీకేజీలపై జగన్, షర్మిల ముందు రావాలన్నారు. వైసీపీ దిక్కుతోచని స్థితిలో ఉందంటూ వ్యాఖ్యానించారు. డీఎస్సీ పూర్తి పారదర్శకంగా జరిగిందని.. ఏం చేయాలో తెలియక కావాలని వైసీపీ రాజకీయం చేస్తోందని మండిపడ్డారు.క్రీడా కోటాలో ఉద్యోగాలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చిందన్నారు. వైసీపీ చేస్తున్న నిరస ప్రజలు ఛీత్కరించుకుంటున్నారని తెలిపారు.

# బ్యాంకాక్‌లో చిక్కుకున్న తెలుగు విద్యార్థులు – సురక్షితంగా తీసుకురావడానికి మంత్రి లోకేశ్ కృషి



: ఉద్యోగాల పేరిట మోసపోయి బ్యాంకాక్‌లో చిక్కుకున్న తెలుగు విద్యార్థులను క్షేమంగా స్వస్థలాలకు తీసుకొచ్చేందుకు మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారు. మంత్రి లోకేశ్ ఆదేశాలతో ఏపీ భవన్ అధికారులు విద్యార్థులతో సమన్వయం చేసుకుంటున్నారు. థాయ్‌లాండ్‌లో ఇబ్బంది పడుతున్న విద్యార్థులతో ఏపీ భవన్ అధికారులు మాట్లాడారు. ఈ సమాచారాన్ని థాయ్‌లాండ్‌లోని భారత రాయబారికి పంపారు.విద్యార్థులను వెనక్కి పంపేలా : స్థానిక కరెన్సీ లేక ఇబ్బంది పడుతున్నారని భారత రాయబారికి ఏపీ భవన్ కమిషనర్ తెలిపారు. తక్ ఇమ్మిగ్రేషన్ అధికారులకు తగిన సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన అన్ని డాక్యుమెంట్స్ ఏపీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. విద్యార్థులు సురక్షితంగా స్వదేశానికి చేరేలా సహకారం అందించాలని తగిన భద్రత కల్పించాలని కోరారు. వీలైనంత త్వరగా విద్యార్థులను వెనక్కి పంపేలా చర్యలు చేపట్టాలని ఏపీ భవన్ కమిషనర్ కోరారు. మంచి భవిష్యత్తు కోసం : ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు యువకులు మంచి భవిష్యత్తు కోసం ఉద్యోగాల వేటలో పడ్డారు. ఇదే అదనుగా భావించిన కొందరు కేటుగాళ్లు వారికి వల వేశారు. థాయ్‌లాండ్‌లో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికారు. వారి మాటలు నిజమేనని నమ్మిన యువకులు బ్యాంకాక్ వెళ్లారు. తీరా అక్కడికి వెళ్లాక అసలు వాస్తవం తెలుసుకున్నారు. ఏజెంట్లు చెప్పిందంతా అబద్ధమని, తాము మోసపోయామని గ్రహించారు.యువకుల పరిస్థితి దారుణంగా : బ్యాంకాక్‌లో చిక్కుకుపోయిన యువకుల పరిస్థితి దారుణంగా మారింది. అక్కడి ఏజెంట్లు వారిని తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారు. బ్యాంకాక్ నుంచి వారిని అక్రమంగా మయన్మార్ దేశానికి తరలించేందుకు కుట్ర పన్నారు. ఈ విషయం తెలుసుకున్న యువకు లు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఏ క్షణాన తమకు ఎలాంటి ముప్పు వాటిల్లుతుందోనని ప్రాణ భయంతో గడుపుతున్నారు. ఉద్యోగం పేరుతో మోసం : ఆపదలో ఉన్న యువకులు తమను తాము రక్షించుకునేందుకు సోషల్ మీడియాను ఆశ్రయించారు. బ్యాంకాక్‌లో తాము పడుతున్న కష్టాలను, నరకాన్ని వివరిస్తూ ఓ వీడియోను రూపొందించారు. ఉద్యోగం పేరుతో తమను మోసం చేశారని అందులో ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాగైనా తమను రక్షించి, స్వదేశానికి సురక్షితంగా తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వానికి కన్నీటిపర్యంతమవుతూ విజ్ఞప్తి చేశారు. యువకులకు లోకేశ్ అభయం : బాధితుల వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ దృష్టికి వచ్చింది. ఆయన వెంటనే బాధితుల ఆర్తనాదాలపై 'ఎక్స్' వేదికగా స్పందించారు. బ్యాంకాక్‌లో చిక్కుకున్న యువకులకు అభయం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా ఉంటుందన్న భరోసాను కల్పించారు.

# ఏపీ ఆర్థిక పరిస్థితిపై చంద్రబాబు సమీక్ష.. అధికారులకు కీలక సూచనలు




**అమరావతి, ఆగస్టు 11:** ఏపీ స్థూల దేశీయోత్పత్తి, నెలవారీ ఆర్థిక నివేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గత నెలకు సంబంధించిన ఆర్థిక నివేదికను ప్రణాళికా విభాగం అధికారులు ముఖ్యమంత్రికి అందజేశారు. ఎల్‌నినో సంక్షోభంలోనూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సానుకూల వృద్ధిని నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రాష్ట్రం 10.7 శాతం వృద్ధిరేటు నమోదు చేసినట్లు వెల్లడించారు.వ్యవసాయ రంగంలో 13.5 శాతం, పారిశ్రామిక రంగంలో 10.6 శాతం, సేవల రంగంలో 9.9 శాతం వృద్ధి నమోదైనట్లు అధికారులు తెలిపారు. సాధారణ ఎగుమతుల్లో రూ.16,322 కోట్లతో 10.5 శాతం మేర వృద్ధి రికార్డైనట్లు వెల్లడించారు. టెక్నాలజీ ఇంటిగ్రేషన్ కారణంగా 21 శాతం వృద్ధితో జీఎస్టీ పన్ను వసూళ్లు రూ.13,282 కోట్లకు చేరిందన్నారు. రూ.2.88 లక్షల కోట్ల భారీ, మెగా ప్రాజెక్టుల గ్రౌండింగ్, రూ.60 వేల కోట్ల ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులతో 73.6 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపారు. ఎల్‌నినో కారణంగా ఈ సీజన్‌కు రాష్ట్రవ్యాప్తంగా 51.8 శాతం మేర లోటు వర్షపాతం నమోదైందన్నారు. 2023-24లో రియల్ జీఎస్డీపీ 6.5 శాతంగా ఉంటే 2025-26 ఏడాదికి 9.9 శాతానికి పెరిగినట్లు తెలిపారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని అధికారులు పేర్కొన్నారు.ప్రతి ప్రభుత్వ శాఖ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా అందుబాటులో ఉన్న వనరుల నిర్వహణ చేపట్టాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. అలాగే, సామాన్య ప్రజలపై అదనపు ధరల భారం పడకుండా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లోనూ వృద్ధి లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ఎల్‌నినో సంక్షోభం నేపథ్యంలో నీటి లభ్యత, ఉత్పత్తుల విలువ జోడింపుపై సూచనాత్మక కంటిజెన్సీ ప్రణాళిక చేయాలన్నారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా ప్రణాళికల విడుదల ద్వారా లక్ష్య సాధన సులువవుతుందని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

# మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిపై కేసు నమోదు



**నెల్లూరు, ఆగస్టు 11:** వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విక్రమ్‌తోపాటు మరో 13 మంది వైసీపీ నేతలపైనా కేసులు నమోదయ్యాయి. నెల్లూరు జిల్లా ఆత్మకూరులో అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. గత ఏడాది ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో అవకతవకలు జరిగాయంటూ, వీటిపై సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ వైసీపీ నేతలతో కలిసి విక్రమ్‌రెడ్డి గత నాలుగు రోజులుగా ఆత్మకూరులో రిలే నిరాహార దీక్షలు చేశారు.మున్సిపల్ బస్టాండ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించేందుకు యత్నించారు. అయితే ర్యాలీకి ముందస్తు అనుమతి లేదంటూ జేఆర్‌పేట వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో వైసీపీ నేతలు వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ ర్యాలీకి సంబంధించి అనుమతి లేదంటూ విక్రమ్ రెడ్డితో పాటు 13 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# శ్రీకాళహస్తి హత్య కేసును ఛేదించిన పోలీసులు.. నలుగురి అరెస్ట్



**తిరుపతి, ఆగస్టు 11:** శ్రీకాళహస్తిలో సంచలనంగా మారిన హత్య కేసును తిరుపతి జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి అంతర్రాష్ట్ర నేరచరిత్ర కలిగిన నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఆగస్టు 2న రాత్రి 7:30 గంటల సమయంలో శ్రీకాళహస్తి పీఆర్ గేట్ ప్రాంతంలో స్వర్ణముఖి నది కట్టపై శివ అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు.. టెక్నికల్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు. వారిని అరెస్ట్ చేసి.. హత్యకు ఉపయోగించిన ఆయుధాలు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.తమిళనాడుకు చెందిన ముగ్గురు, పుత్తూరుకు చెందిన ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై తమిళనాడు రాష్ట్రంలో గతంలో పలు క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. చెన్నైకి చెందిన థొప్పై గణేశన్ గ్యాంగ్(ఎప్త్రశీజూజూఖఱ +ఖఅవయఖఅ +ఖఅస్త్ర)తో నిందితులకు సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. హత్యకు ఉపయోగించిన బైక్, రెండు కత్తులు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కేసును ఛేదించడంలో కీలకంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

# వైసీపీ పట్ల భవిష్యత్‌లో జాగ్రతగా ఉండకపోతే.. తీవ్ర ఇబ్బందులు: మంత్రి అచ్చెన్న



**భీమవరం, ఆగస్టు 11:** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకి 'అక్వా రంగం' మానస పుత్రిక అని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళవారం పాలకొల్లులో అక్వా సభలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారంటూ ఆ పార్టీ నేతలపై మండిపడ్డారు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించి, మన రాష్ట్రం పేరు చెబితే అందరూ అసహ్యించుకునే పరిస్థితికి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరే సమయానికి రాష్ట్ర ఖజనా ఖాళీ అయిందని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి కూడా డబ్బులు లేని పరిస్థితి ఉందని వివరించారు.ప్రస్తుతం మన రాష్ట్రం వెంటిలేటర్ నుంచి ఆక్సిజన్ పీల్చుకునే స్థాయికి వచ్చామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తుందని చెప్పారు. 2019లో ఆవేశానికి లోనై ఓ దొంగను, ఓ దోపిడీదారుడిని, ఓ గొడ్డలి పార్టీని అధికారంలోకి తెచ్చారని అన్నారు. గొడ్డలి పార్టీకి స్వేచ్ఛ ఇస్తే.. రాజ్యాంగాన్ని గౌరవించి అధికారం ఇస్తే సర్వ నాశనం చేశాడంటూ వైఎస్ జగన్‌పై నిప్పులు చెరిగారు. ఇటువంటి పార్టీ పట్ల భవిష్యత్‌లో జాగ్రతగా ఉండకపోతే.. తీవ్ర ఇబ్బందులు పడతామని ప్రజలను ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు హెచ్చరించారు. అక్వా రంగాన్ని నాశనం చేసిన వ్యక్తి, పరామంగొడ్డలి పార్టీకి స్వేచ్ఛ ఇస్తే.. రాజ్యాంగాన్నిస్ఠ పేరుతో రైతుల దగ్గరకు వస్తే, ప్రశ్నించాల్సిన బాధ్యత మీపై లేదా? అని ప్రజలను ఆయన సూటిగా ప్రశ్నించారు. జగన్ హయాంలో అక్వా ఫీడ్‌కు అవసరమైన వస్తువుల ధరలు పెరగక పోయినా.. వాటి ధరలు ఆరు సార్లు పెంచారని చెప్పారు. త్వరలో ఫిష్ మీల్, ఫిష్ ఆయిల్ ధరలను 50 శాతం తగ్గించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. అదే జరిగితే అక్వా ఫీడ్ ధరలు తగ్గుతాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# ఆగని వైఎస్సార్సీపీ శ్రేణుల అరాచకం – మహిళా ఏఎస్ఐను తోసుకుంటూ ముందుకు



**శ్రీకాకుళం జిల్లా :** వైఎస్సార్సీపీ శ్రేణులు రెచ్చిపోతున్నారు. అనుమతులు లేకుండా ర్యాలీలు చేయడమే కాకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. అంతటితో ఆగకుండా అడ్డుకుంటున్న పోలీసులపై విరుచుకుపడుతున్నారు. ఇటీవల వైఎస్ జగన్ శ్రీకాకుళం జిల్లా పర్యటన సందర్భంగా నడిరోడ్డు మీద మహిళా ఎస్సైపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. అది మరవకముందే తాజాగా చిత్తూరు జిల్లాలో మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ చేపట్టిన ర్యాలీలోనూ మహిళా ఏఎస్?ఐపై దాడికి పాల్పడ్డారు. చిత్తూరు జిల్లా పూతలపట్టులో మహిళా ఏఎస్ఐ జ్యోతిపై వైఎస్సార్సీపీ నేతలు దౌర్జన్యానికి దిగారు. మెగా డీఎస్సీ నిరసన ర్యాలీకి గుంపులు గుంపులుగా రావద్దని శాంతియుతంగా ఆందోళనలు చేయాలని ఆమె కోరుతుండగానే వైఎస్సార్సీపీ నాయకులు మహిళ అని కూడా చూడకుండా తోసేసి ముందుకెళ్లారు.పోలీసుల విధులకు ఆటకం : ఆమె కింద పడడంతో తలకు గాయమైంది. పోలీసు సిబ్బంది ఆమెను గమనించి పైకి లేపారు. ఏఎస్?ఐ రోడ్డుపై పడ్డ సమయంలో వైఎస్సార్సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న సునీల్ కుమార్ కనీసం ఆమెను పక్కకు తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు చెప్పకోకుండా ముందుకు వెళ్లారు. ప్రస్తుతం ఏఎస్?ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసుల విధులకు ఆటకం కలిగించడం, గాయపడిన మహిళ ఏఎస్?ఐ ఫిర్యాదు మేరకు సునీల్ కుమార్‌తో సహా 24 మందిపై కేసు నమోదైంది.పోలీసులు చెప్పినా వినకుండా : నియోజకవర్గంలోని వైఎస్సార్సీపీ శ్రేణులు పూతలపట్టుకు భారీగా తరలివచ్చాయి. ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు ముందుగానే చెప్పినా వినకుండా పెద్ద ఎత్తున కార్యకర్తలను సమీకరించారు. వాహనాల రాకపోకలకు విఘాతం కలిగించారు. వీరిని అడ్డుకోవడానికి పోలీసులు బారికేడ్లు ఉంచారు. ఈ క్రమంలోనే బారికేడ్ల వద్ద ఏఎస్సై జ్యోతి ఉన్నారు. బారికేడ్లు తొలగించుకుంటూ కొందరు, రోప్లను తీసేస్తూ మరికొందరు రావడంపై ఆమె అభ్యంతరం చెబుతున్న సమయంలోనే ఈ ఘటన జరిగింది. ఘటనకు సంబంధించిన వీడియో ఫుటేజ్, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.కేసు నమోదు: ఇక నెల్లూరు జిల్లా మనుబోలులో వైఎస్సార్సీపీ నేతలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ సోమవారం వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డితో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలపై కేసులు నమోదైనట్లు ఎస్ఐ మహ్మద్ హనీఫ్ తెలిపారు. ముందస్తు ప్రజలకు ఇబ్బందులు కలిగించడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించారని పోలీసులు తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా ర్యాలీ చేపట్టారన్న ఆరోపణలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

# పోలీసుల వైఫల్యంపై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తా




**కర్నూలు జిల్లా:** కర్నూలు జిల్లాలో వైఎస్సార్సీపీ నాయకులు రౌడీషీటర్లతో కలిసి తమ పార్టీ కార్యకర్తలను హత్య చేస్తున్నా పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని మంత్రి టీజీ భరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం కార్యకర్త ఇంతియాజ్‌ను పథకం ప్రకారం హత్య చేసినా ఎస్పీ తేలిగ్గా తీసుకున్నారని మండిపడ్డారు. జిల్లాలో దారి తప్పుతున్న శాంతిభద్రతలపై రెండ్రోజుల్లో సీఎం చంద్రబాబును కలిసి ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు. మరోవైపు ఇంతియాజ్‌ను అత్యంత దారుణంగా చంపిన విజువల్స్ తాజాగా వెలుగులోకి వచ్చాయి. కర్నూలులో పాతబస్తీకి చెందిన టీడీపీ కార్యకర్త ఇంతియాజ్‌ను వైఎస్సార్సీపీ గూండాలు, రౌడీషీటర్లు పక్కా పథకం ప్రకారం హత్య చేశారని మంత్రి టీజీ భరత్ ఆరోపించారు. వారం రోజుల ముందే వైఎస్సార్సీపీ రౌడీలు సోషల్ మీడియాలో ఇంతియాజ్ ఫొటో పెట్టి రిప్ అని రాశారంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.టీడీపీ కార్యకర్త హత్యకేసులో ఏ1గా ఉన్న ఉస్తాద్ మహబూబ్ ఖాన్ అనే వ్యక్తి జైలు నుంచి బయటికి వచ్చేటపుడే మళ్లీ జైలుకు వస్తానని చెప్పాడనే సమాచారం తనకు ఉందని పోలీసులు ఈ విషయాన్ని ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదని ప్రశ్నించారు. హంద్రీనదిలో వైఎస్సార్సీపీ ఆక్రమణలపై తరచూ ప్రశ్నిస్తున్నందునే ఇంతియాజ్‌ను పథకం ప్రకారం హత్య చేశారని తెలిపారు. దీనిపై ఎస్పీకి ఫోన్ చేసినా తేలిగ్గా మాట్లాడరని మంత్రి అన్నారు.